



**యా వద్దక్షిణ భారతం**లోని కోటీశ్వరులలో ఒకడైన శ్రీపతి తన ఆఫీస్ రూంలో కూర్చుని విచారంగా నిట్టూర్పులు విడుస్తున్నాడు.

శ్రీపతి ఆఫీస్ రూం ఒక బ్రహ్మాండమైన హాలులో ఒక మూలగా, గ్లాసులతో నిర్మించబడిన గదిలో, ఎయిర్—కండిషన్ చేయబడి చాలా విలువైన ఫర్నిచర్‌తో, కార్పెట్సులతో నిండి ఉంది. శ్రీపతి ఎటువైపు చూసినా కుర్చీలలో కూర్చుని పని చేసుకుంటున్న అనేక మంది గుమాస్తాలు, మేనేజర్లు, అకౌంటెంట్లు కనిపిస్తారు. కానీ శ్రీపతి మాత్రం ఎవ్వరికీ కనుపించడు. ఒకవేళ ఎవరైనా శ్రీపతి వంక చూసినా, లోని శ్రీపతి కనబడక తమ రూపు, తమ సహోద్యోగుల నీడలు శ్రీపతి అద్దాల గోడలలో కనుపిస్తాయి. కనుకనే శ్రీపతి తమవంక ఎప్పుడు చూస్తున్నాడో, ఎప్పుడు చూడడంలేదో తెలియక ఆ ఆఫీసులో పనిచేసే వారంతా తలలు వంచుకుని పనిచేస్తారు. కనీసం చేసినట్లు కనబడుతుంటారు.

శ్రీపతి తన అద్దాల గదిలో నుండి చాలాసేపటి నుండీ తన కింది ఉద్యోగులను దిగాలుగా పరిశీలి స్తూనే ఉన్నాడు. అయితే ఆ రోజు శ్రీపతి చేస్తున్న పరిశీలనలో ఆ ఆఫీసులో పనిచేసే స్త్రీ ఉద్యోగులు మాత్రమే ఉన్నారు.

ఆ రోజు ఉదయం శ్రీపతి యాథాలాపంగా పేపర్ చూచాడు. అందులో ప్రచురించబడిన ఒక విదేశీ వార్త శ్రీపతిని కుదిపివేసింది. అనేక మాసా లుగా తనను తినివేసే సమస్యకు దారి దొరికినట్లు తట్టింది శ్రీపతికి — ఆ వార్త చదువుతుంటే.

అందుకనే ఆ వార్త చదివినప్పటి నుండి తన ఆఫీసులో ఉన్న స్త్రీ ఉద్యోగుల నందరినీ చూస్తూ తన ప్లాన్‌కు ఎవరు సరిపోతారా అని పరిశీలి స్తున్నాడు శ్రీపతి. ఒక్కో స్త్రీ ఉద్యోగిని పరిశీలించి, నెమరువేసుకుంటూ ఆఖరుకు 'ప్చ్! ఈ అమ్మాయి ఒప్పుకోదు! ఆ అమ్మాయి వింటేనే మండిపడు తుంది! ఈ పిల్ల దగ్గర రహస్యం దాగదు' అని విచారంగా నిర్ణయించుకుని, మరో పిల్లను పరిశీ లిస్తూ — ఈ విధంగా ఉదయం నుండీ కాలక్షేపం చేశాడు. తన వంతకం కోసం వచ్చిన పాడ్‌లను ఒక్క దాన్ని గూడా ముట్టుకోలేదు. ఆఫీసులో ఉన్న స్త్రీ ఉద్యోగుల నందర్నీ పరిశీలించి, 'ఛీ! లాభం లేదు! ఇది ఇండియా! ఈ దేశంలో డబ్బు తీర్చలేని కోరికలు కూడా ఉంటాయి!' అనుకున్నాడు శ్రీపతి. ఈ భావం రాగానే పొద్దున తను చదివిన వార్తకోసం టేబిల్ మీద పేపర్‌ను తీసుకొని, ఆ వార్తను మరో మారు చదివాడు. హఠాత్తుగా కోపం వచ్చి పేపర్‌ను విసిరి గదిలో ఒక మూలగా కొట్టాడు.

ఇంతలో టెలిఫోన్ బెల్ గణగణ మ్రోగింది.

శ్రీపతి ఫోన్‌ను ఎత్తుకుని "రీటా! ఫోన్ ఎవరి నుండి?" అని అడిగాడు.

"అమ్మగారి దగ్గర నుండి, సర్. సుమిత్రమ్మ గారి దగ్గర్నుండి, సర్!" అని ఫోన్‌లో వినిపించింది.

శ్రీపతి ముఖంలోని విచారం పటాపంచలైంది. "ఎస్!" అన్నాడు ఫోన్‌లో వూపిరి బిగబట్టి. శ్రీపతికి ఫోన్‌లో చిటపట చప్పుడు వినిపించింది.

"సుమిత్రా డియర్!" ఆర్ద్రంగా ఫోన్‌లో అన్నాడు శ్రీపతి.

"నేనేనండీ!"

"ఏమన్నాడు స్పెషలిస్టు?"

"లాభం లేదన్నాడు."

అంత పొడుగూ, లావూ ఉన్న శ్రీపతి కుర్చీలో కుంచించుకుపోయాడు.

సుమిత్ర మవునంగానే ఉన్నది. ఆఖరుకు శ్రీపతి తేరుకుని అన్నాడు:

"సుమిత్రా!"

"చెప్పండి."

"అంత లావు యు. ఎస్. విజిటింగ్ ప్రొఫెసర్ ఆవ్ గైనకాలజీయే కాదంటే ఇంక మనకు పిల్లలు పుడతా రన్న నమ్మకం లేనట్లేనా?!"

**—చివుకుల పురుషోత్తం**

"నే నా మాట ఎన్నడో చెప్పాను! ఒకరిద్దరు డాక్టర్లు చెప్పేదాంట్లోనే నిజం ఉంటుంది. ఆ తరవాత ఎన్ని వందల మందిని చూపినా, కొత్త మాట వినపడదు. ఇక లాభం లేదు. మీరు రెండో పెండ్లి చేసుకుని తీరాల్సిందే! ఇన్నాళ్ళూ చెప్పి చెప్పి నాకు విసుగు పుట్టినా, చెప్పడం మట్టుకు మానను. మీరు రెండో పెండ్లి చేసుకుని తీరాల్సిందే!"

"సుమిత్రా! అది నేను వినను! అయినా, పెండ్లి కాకుండానే మనం సంతానవంతులం కావచ్చు."

"అబ్బా! అది లాభం లేదంటే ఎందుకు వినరు? దత్తత తీసుకుంటే, ఆ బిడ్డడి వెనుక వాళ్ళు మనల్ని తినేస్తారు. అనాథ శరణాలయంలో బిడ్డను తెచ్చుకుంటే, ఆ శరణాలయం వారికి, వారి వెనుక నున్న ప్రభుత్వానికి జీవితాంతం ఆ పిల్లాణ్ణి గురించి

పంజాయిషీలు చెప్పుకోవాలి! ఎన్నిసార్లు చెప్పినా మీరు వినిపించుకోరు. ఇక మీరు ఏం చెప్పినా వినను. మీరు రెండో పెళ్ళి చేసుకోకుంటే నేను—నేను బావిలో దూకుతాను."

శ్రీపతి నెత్తిన పిడుగు పడ్డట్టుగా విలవిల లాడాడు.

"సుమిత్రా! అంత మాట అనకు! చూడు! ఇవ్వాళ ఒక అయిడియా వచ్చింది! నీవు బావిలో దూకే పనిలేదు. నేను రెండో పెండ్లి చేసుకో నవసరం లేదు."

"మళ్ళీ మొదటికే వచ్చారు."

"మొదటికి కాదు—చివరికే వచ్చాను!"

"ఏమిటండీ ఆ అయిడియా?!" కొంచెం ఉత్కంఠగానే అడిగింది సుమిత్ర.

"అంత గొప్ప అయిడియాను ఫోన్లో చెప్ప కూడదు!"

"అయితే ఇంటికి రండి!"

"ఓ కే."

శ్రీపతి ఫోన్ పెట్టేసి రివాల్వింగ్ ఛెయిర్లో నుండి ఒక్క దూకున తన గదిలోనుండి వెలుపలికి వచ్చి చకచక నడుచుకుని ఆఫీస్ హాల్ వదిలి లిఫ్ట్లో గ్రాండ్ ఫ్లోర్ చేరుకుని, దాదాపు పరుగెత్తినట్లుగా వెళ్ళి దూరంగా ఉన్న గారేజీలోని తన కారులో వెళ్ళి కూర్చుని ఇంటికి బయలుదేరాడు.

శ్రీపతి కారు ఒక మూడంతస్తుల భవనం ముందు ఆగింది.

శ్రీపతి కారు దిగి, చకచక నడిచి ఇంట్లోకి వెళ్ళాడు.

"సుమిత్రా! ముందు ఆ స్పెషలిస్ట్ ఏమన్నాడో చెప్పు" అని అడిగాడు.

సుమిత్ర సోఫాలోనుండి లేచి శ్రీపతి కోటును విప్పి సోఫామీద పడేసి, జగ్లో నుండి కాఫీని ఒక కప్లో పోసి శ్రీపతికి ఇచ్చింది. శ్రీపతి కాఫీ కప్పు అందుకుని టీపాయ్ మీద పెట్టి "ఊ... చెప్పు!" అన్నాడు.

సుమిత్ర అయిష్టంగా అయినా క్లుప్తంగా స్పెషలిస్ట్ చేసిన పరీక్షలు, ఆయన చెప్పిన మాటలు చెప్పింది.

"ఇంతకూ ఏంటో అయిడియా అన్నారు! ఏం టా అయిడియా?"

"సింపుల్! ఇతర దేశాల్లో సంతానం లేనివాళ్ళు అనేక కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారు. సంతానం లేని వాళ్ళకు దత్తత తీసుకోవడం, రెండో పెళ్ళి చేసుకోవడమే మార్గాలు కాదు!"

సుమిత్ర ఆశ్చర్యంగా శ్రీపతి వంక చూసింది.

"ఆ రెండూ కాక ఇంకేం పద్ధతులు ఉన్నా యండీ?"

"చాలా ఉన్నాయి! అవన్నీ ఇక్కడ ఆచరణ సాధ్యం కాదు! కానీ ఒక్కటి మటుకు మనకు అందుబాటులో ఉంటుంది!"

"ఏంటండీ అది? సస్పెన్సులో పెట్టక త్వరగా చెప్పేయండి!"

"ఒక మంచి పిల్లను చూడడం! రెండో కంటికి తెలీకుండా ఆ అమ్మాయితో ఒక నిర్ణయం చేసుకోవడం! ఆమెను కొంతకాలం దూరంగా ఎక్కడో ఉంచి, ఆమెతో కాపురం పెట్టడం. బిడ్డ కలిగాక బిడ్డను ఇంటికి తెచ్చుకోవడం ఆమె కోరినంత ధనం ఇచ్చి పంపేయడం!"

సుమిత్ర కళ్ళు పత్తికాయలల్లాగా అయిపోయాయి.

"మీ పిచ్చిగాని, ఇది రెండో పెండ్లి కాక పోతుందా?"

"రెండో పెండ్లి కాకుండా ఉండాలనే నా భావం! మనకు బిడ్డ కావాలి! మన బిడ్డ! నా రక్తస్పర్శ కలిగిన బిడ్డ! కానీ, ఆ స్త్రీతో నాకు అంతకంటె సంబంధం ఉండదు! అందుకనే ఆమె కోరినంత డబ్బిస్తాం!"

"ప్చ్! ఇది జరిగే పని కాదు!"

"ఎందుకు జరగదు! మనం ఎన్ని చదవడం లేదు పేపర్లలో! బిడ్డను కని, చెత్త కుండీలో పారవేసిన తల్లులున్నారు. బిడ్డను బావిలో పారవేసిన తల్లులున్నారు. బిడ్డను డబ్బులకు అమ్ముకున్న వాళ్ళున్నారు! అలాంటి వాళ్ళలో ఏ స్త్రీ అయినా ఫరవాలేదు. కానీ నా రక్త స్పర్శ కలిగిన బిడ్డ మనింట్లో తిరుగాడడం అంటే ఈ పని చేయక తప్పదు!"

సుమిత్ర దీర్ఘంగా నిట్టూర్చింది. శ్రీపతి రక్త స్పర్శ కలిగిన బిడ్డ తన ఇంట్లో ఉంటే, అంతకంటే తనకు కావలసింది లేదు. ఆ సంతోషం కోసం సవతి పోరు బాధను అనుభవించడానికి సిద్ధమైంది కానీ, సవతి బాధ లేక శ్రీపతి రక్తస్పర్శ కలిగిన బిడ్డను పొందడం సుమిత్రకు అడియాసగా తోచింది.

ఆ రోజు శ్రీపతి, సుమిత్ర చాలాసేపు ఆలోచించుకుని, తర్కించుకుని ఒక నిర్ణయానికి వచ్చారు.

• • •

వారం రోజుల తరవాత ఒకనాడు శ్రీపతి తనకు రాబోయే వారసుడి తల్లి అన్వేషణకు బయలుదేరాడు. ఈ వారం రోజుల లోనూ శ్రీపతి, సుమిత్ర తమకు రాబోయే బిడ్డ తల్లి లక్షణాలు ఎలా ఉండాలో చర్చించుకున్నారు.

శ్రీపతి మామూలు దుస్తులు ధరించి కారులో ఎక్కి, డ్రైవర్ కారును నడుపుతూ ఉండగా సాయంకాలం ఏడు గంటల ప్రాంతంలో ఇంటినుండి బయలుదేరాడు.

ఇంటినుండి ఒక అరమైలు వెళ్ళాక నాలుగు రోడ్ల కూడలిలో శ్రీపతి కారు ఆపించి, కారు దిగి, కారును ఇంటికి తీసుకెళ్ళమని డ్రైవర్తో చెప్పి కాలి నడకన బయలుదేరాడు.

శ్రీపతి ఒక వ్యభిచార వాడకు బయలుదేరాడు.

శ్రీపతి తన జీవితంలో వ్యభిచారవాడకు పోవడం ఇదే మొదలు! అక్కడే తన బిడ్డకు కాబోయే తల్లి ఎవరు కావాలని అతడి నిర్ణయం. తనకు రాబోయే బిడ్డకు తల్లి ఒక వ్యభిచారిణి అయినా, అంత డబ్బు పారేస్తే ఆ వేశ్య బిడ్డను తమకు వదిలి నిర్విచారంగా వెళ్ళిపోతుంది. కానీ అదే ఒక గౌరవనీయమైన స్త్రీ అయితే బిడ్డ పైన వ్యామోహాన్ని వదులుకో

శ్రీ కవితా వారి నూతన ప్రచురణలు
ఆంధ్రుల అభిమాన రచయిత(త్రు)ల నవలలు
ఈ నెలలోనే విడుదలయినవి
ఆదర్శాలు... పి. పద్మినీదేవి 15-00
(తొలి ఉషస్సుకే మైమరచి అనుకోని మలి ఉషస్సును అందుకోలేక తికమకమైన ఓ అందాలసుందరి కథ)
అమర ప్రేమ... కాకాని కమల 6-00
(ప్రేమ వేరు- పెళ్ళి వేరు- మనసు వేరు- మమత వేరు ప్రణయ జీవితానికి కొత్త అర్థము నిచ్చిన ఓ చిననవల)
పెద్దకర్ర ...... సోమంచి రామం 11-00
(జయశ్రీ సీరియల్) ఇది కాంతకథ కాదు ఇంతోటి సంఘంలోని చాలామంది నీపగాథతో కూడిన నవల)
చిట్టిబాబు అపూర్వంగా చిత్రించిన నవలలు
సూర్యకాంతి.... చిట్టిబాబు 10-00
(వెలుగు వెన్నెల గోదారిలా సాగిపోయే చిరస్మరణీయ ప్రవంతి సూర్యకాంతి)
అనుభవం..... చిట్టిబాబు 10-00
(సెలయేటి పరుగల్లే గలగలా చకచకా మిమ్మల్ని గిలిగింత పెట్టే నవల)
మీకు కావలసిన పుస్తకాల ధరల్లో 1 రూ. తగ్గించి M.O. చేసిన ఆర్డరు పాయికి V.P.P. లో పంపగలము.
శ్రీ కవితా పబ్లికేషన్స * మ్యూజియం రోడు... విజయవాడ. 2

లేకపోవచ్చు. ఆ తరవాత చాలా గొడవలు.

శ్రీపతికి శరీరం వణుకుతున్నది. వ్యభిచార వాడలో అలవాటు లేకుండా కాలు పెట్టడం ఒకటి, తీరా వ్రతం చెడ్డా ఫలితం దక్కుతుందా అన్న సంశయం ఒకటి—రెండూ కలిసి శ్రీపతిని భయపెడుతున్నాయి.

శ్రీపతి ఆలోచనల నుండి తేరుకుని, తన చుట్టూ ఉన్న ఇళ్ళను, గుడిసెలను చూస్తూ ఉన్నాడు. ప్రతి ఇంటి ముందూ కాగితం పూలలా అందంగా అయినా ప్రాణరహితంగా యువతులు నిలబడి తన వంక ఆశగా చూడడాన్ని గమనించాడు శ్రీపతి.

ఎంత సేపటికి ధైర్యం చిక్కక శ్రీపతి ఆ బజారులో అటూ, ఇటూ పచార్లు చేస్తుంటే శ్రీపతి కొందరు యువతుల దృష్టిలో పడ్డాడు. అయినా శ్రీపతి వేషం, వాలకం చూస్తుంటే ఆ యువతులకు ధైర్యం చిక్కలేదు. కొంతసేపు అటూ, ఇటూ తిరిగి శ్రీపతి ఒక చోట నిలబడి ఆలోచనలలో పడ్డాడు. ఆ బజారు వాతావరణం, ఆ బజారులోని వ్యక్తుల ప్రవర్తన చూశాక శ్రీపతి మనస్సు ఆందోళనతో నిండిపోయింది. హాయిగా సుమిత్ర చెప్పినట్టు రెండో పెళ్ళి చేసుకోక ఎందుకీ అవస్థ అనుకున్నాడు.

శ్రీపతి ఆగిపోవడం చూసిన ముగ్గురు, నలుగురు యువతులు చప్పున గ్రహించేశారు—శ్రీపతి కేవలం దారిన పోయే దానయ్య కాడని. దాంతో వారంతా శ్రీపతిని చుట్టి వేసి రకరకాల అసభ్య ప్రశ్నలు వేశారు. అలా వారు ప్రశ్నిస్తుంటే తెలిసిన వాళ్ళెవరైనా చూస్తున్నారా అని చుట్టూ బెదురు చూపులతో కంగారుగా సమాధానాలు ఇస్తున్న శ్రీపతిని చూసి ఒక ముసలమ్మ శ్రీపతి దగ్గరకు గబ గబ వచ్చి యువతులను తరిమి వేసింది. యువతులు ఈసడించుకుంటూ, ముసలమ్మను ఎదిరించలేనట్లు దూరంగా జరిగి శ్రీపతినే చూస్తున్నారు.

"బాబుగారూ, తమరు ఈ ఈడికి రావడం కొత్త అనుకుంటాను?" అన్నది ముసలమ్మ శ్రీపతితో.


"అవునవును."

"నా ఎనకాల రా, బాబూ! మంచి చోటికి తీసుకెళ్తాను" అంటూ ముసలమ్మ శ్రీపతి సమాధానం కోసం ఎదురు చూడకుండా దోవ తీసింది. శ్రీపతి ఆవు వెంట దూడ లాగా ముసలమ్మను అనుసరించాడు.

ముసలమ్మ శ్రీపతిని కొంత దూరం నడిపించి ఒక లోగిలి లోకి తీసుకెళ్ళింది. ఆ లోగిలిలో ఒక నడివయస్సు స్త్రీ ఒక వాలు కుర్చీలో కూర్చుని లోపలికి వచ్చే శ్రీపతినీ, ముసలమ్మనూ ఆసక్తిగా చూస్తున్నది. ముసలమ్మ ఆ స్త్రీ దగ్గరికెళ్ళి చెవిలో ఏదో గుస గుస లాడింది. చెవిలోని గుస గుస తెమలక ముందే ఆమె లేచి—"రండి, బాబూ, రండి" అంటూ వగలుపోతూ శ్రీపతిని ఆహ్వానించి గదిలోకి తీసుకెళ్ళింది.

శ్రీపతి ఆ గదిలో కాలు పెడుతూనే 'షాక్' తిని, రెండడుగులు వెనక్కు వేశాడు. ఆ గదిలో పది మంది యువతులు కూర్చుని పిచ్చాపాటీగా మాట్లాడుకుంటున్నారు.

శ్రీపతిని చూసి ఎవరూ బెదరలేదు కాని,




అంతా శ్రీపతి వంక ఒక్క క్షణం చూసి, ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా ఒకరి నొకరు చూసుకుని ముసి ముసిగా నవ్వుకున్నారు.

"బాబుగారూ! మీకు నచ్చిన పిల్లను ఎన్నుకోండి, బాబూ" అంటూ మరో మారు ఒయ్యారంగా శ్రీపతి వంక చూసి గది వదిలి వెళ్ళిపోయింది.

రెండు నిమిషాల పాటు శ్రీపతి ఆ గదిలోని యువతుల వంక చూస్తూ తల వంచుకుంటూ, మళ్ళీ చూస్తూ ఇబ్బందిగా నిలుచున్నాడు.

ఇంతలో ఒక యువతి లేచి శ్రీపతి దగ్గరగా వచ్చి, అతని చేతిని తన చేతిలోకి తీసుకుని, "రండి" అంటూ ఆ యువతులందర్నీ తప్పుకుని, అక్కడికి దగ్గరగా ఉన్న ఒక గదిలోకి వెళ్ళింది.

ఆ యువతి శ్రీపతిని గదిలో ఉన్న మంచం మీద కూర్చోపెట్టి కొద్ది క్షణాలు పరిశీలించింది.

శ్రీపతికూడా ఆ యువతిని పరిశీలించాడు. ఆ యువతికి ఇరవై సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. ఆమె వస్త్రధారణ, అలంకరణ మోతాదుకు మించి ఎబ్బెట్టుగా ఉన్నట్లు తోచింది శ్రీపతికి.

"ఇటువంటి చోటుకు రావడం ఇదే. మొదలా?" సందేహంగా అడిగిం దా యువతి.

"అవును" ముక్తసరిగా సమాధానం ఇచ్చి, బుద్ధావతారం లాగా మంచం మీద కూర్చుని ఉన్నాడు శ్రీపతి.

ఆ యువతి శ్రీపతిని జాలిగా చూసింది. మెల్లగా నడిచి వచ్చి శ్రీపతి పక్కన కూర్చుని, అతని వీపు నిమురుతూ అన్నది:

"నా పేరు అనసూయ!"

"ఆహా!"

"మీ పేరు?"

"శ్రీపతి!"

"రండి!" అంటూ శ్రీపతిని తన ఒడిలోకి లాక్కుంది అనసూయ.

తనను దగ్గరకు తీసుకునే ప్రయత్నానికి అడ్డు తగులుతూ శ్రీపతి అన్నాడు:

"నే నొచ్చింది వేరే పనికి!"

అనసూయ శ్రీపతిని చటుక్కున వదిలి శ్రీపతి వంక అనుమానంగా చూస్తూ, "వేరే పనికా?" అని అన్నది.

"అవును!"

"ఏంటా పని?" శ్రీపతికి దూరంగా జరిగి కూర్చుని అన్నది అనసూయ.

". . ."

"చెప్పండి!"

"నాకు...నాకు...బిడ్డలు లేరు!" బెరుకుగా అన్నాడు శ్రీపతి.

పకపక నవ్వబోయి ఆపుకుని అనసూయ అన్నది—హాస్యంగా, హేళనగా:

"పెళ్ళైందా?"

"ఆఁ!"

"ఎన్నేళ్ళైంది?"

"పదేండ్లు!"

"వూఁ" అంటూ కొద్ది సేపు ఆలోచనలో పడి, మళ్ళీ అడిగింది అనసూయ:

'సరే! మీకు బిడ్డలు కావాలి! డాక్టర్లకు..."

"అవన్నీ అయిపోయాయి!"

"బిడ్డలు కలగకపోవడం ఎవరి లోపం?"

"నా భార్యదే!"

"వూఁ!...రెండో పెండ్లి..."

"ఇష్టం లేదు."

"మరి... ఎవరి బిడ్డనైనా పెంచుకోండి!"

"అదీ ఇష్టం లేదు?"

ఇప్పుడు అనసూయ నిజంగా ఆశ్చర్యపడి పోయింది.

"మరి...బిడ్డలు ఎలా వస్తారు?!"

"అందుకే... నీ సాయం కావాలి!"

"నా సాయమా?!"

"అవును!"

"మీరు చెప్పేది బొత్తిగా అర్థంకావడం లేదు!"

శ్రీపతి ధైర్యం తెచ్చుకొని తన మనస్సులోని మాటను బయటపెట్టాడు. "నాకు ఈ విషయంలో నీ సాయం కావాలి. నీకు వేరే ఒక ప్రత్యేకమైన ఇల్లు తీసుకుంటాను. అందులో కొంతకాలం నాతో ఉండాలి! ఒక బిడ్డ పుట్టాక 'ఆ బిడ్డను నా కిచ్చి నీవు వెళ్ళిపోవాలి! ఇక నీకూ, నాకూ ఎలాంటి సంబంధమూ ఉండదు. జీవితంలో ఇక నీవు నా వంక గానీ, బిడ్డ వంకగానీ తిరిగి చూడగూడదు!"

అనసూయ శ్రీపతి వంక చిత్రంగా చూసింది.

"చెప్పు! అలా చేయడానికి నీకు ఎంత డబ్బు కావాలి?"

"ఎంత ఇవ్వగలరు?" ఎటూ నిర్ణయించుకోకుండానే అడిగింది అనసూయ.

"అయిదు వేలు!"

అయిదు వేల రూపాయలు అనసూయలో ఎలాటి నిర్ణయాన్నీ కలగజేయలేకపోయాయి. అనసూయ మవునంగా శ్రీపతిని చూస్తూ ఉండిపోయింది.

"పది వేలు ఇస్తాను! ఏమిటి నీ సమాధానం!"

"ప్చ్! నా వల్ల కాదు! ఇంకెవరినైనా చూసుకోండి!" హటాత్తుగా కఠినమైన నిర్ణయం చేసుకున్న దానిలా అన్నది అనసూయ.

శ్రీపతి నిరాశగా అనసూయ వంక చూశాడు.

శ్రీపతిని ఒక విచిత్రమైన జంతువుగా చూసింది అనసూయ.

"చూడు, అనసూయా! ఒక సంవత్సరం పాటు నీవు నాతో ఉంటే, నా కోర్కె తీరగలదు. నీకు పది వేల రూపాయ లిస్తాను!"

". . . . . . . . . ."

"పోనీ ఎంత కావాలో నీ వడుగు!"

"డబ్బు ప్రశ్న కాదు! ఆడవాళ్ళకు, ముఖ్యంగా నా లాగా వృత్తిలో ఉన్న ఆడవాళ్ళకు బిడ్డలు పుట్టడం అంటే ఏమిటో తెలుసా?!"

"చెప్పు!"

"మాకు వృత్తి పోతుంది!"

"ఎందుకని?! బిడ్డలను కన్న ఆడవాళ్ళు వృత్తిలో లేరా?!"

"ఉండచ్చు! కానీ వాళ్ళకు విలువ తక్కువ! బిడ్డ పుట్టాక ఆడదాని అందం చెడిపోతుంది! ప్చ్! నా వల్ల కాదు! ఇంకెవర్నైనా చూసుకో!" అంటూ అనసూయ మంచం మీద నుండి లేచి, గది తలుపు దగ్గరగా వెళ్ళింది.

అనసూయ మాటలకు శ్రీపతికి ఆశ్చర్యం, అయినా కొంత ఆశా కలిగాయి.

ఎంత నీచురాలైన ఆడదానినైనా సరే— ఏమైనా అడగవచ్చును గాని, కన్న బిడ్డను వదిలి పొమ్మనడం చాలా కఠినమైన విషయం. అటువంటి ఆలోచనను ఏ ఆడదైనా ఒప్పుకోదని శ్రీపతి అనుకున్నాడు. కానీ, కన్న బిడ్డపైన ఎలాంటి భావన లేక, కేవలం బిడ్డను కన్నందున తన అందం చెడిపోతుందన్న అనసూయపైన శ్రీపతికి ఆశ కలిగింది. ఇటువంటి భావం కలిగిన ఆడదైతే రేపు ఉత్తరోత్తరా ఏ పేచీలు పెట్టదని అనిపించింది.

చేతికి దొరికిన పెన్నిధి జారిపోతున్నట్టుగా తోచి శ్రీపతి చివాలున మంచం మీది నుండి లేచి ఒక్క దూకులో తలుపు దగ్గర ఉన్న అనసూయ దగ్గరికి వెళ్ళి, ఆమె చేతులు పట్టుకొని మెల్లగా లాక్కొని వచ్చి మంచం మీద కూర్చోబెట్టాడు.

"అనసూయా! నీ భయం నాకు అర్థం అయింది! అయితే బిడ్డను కన్నందువల్ల నీ అందం చెడిపోయి, నీకు వృత్తి పోతుందని నీ భయం అన్న మాట! సరే! ఇంతకూ నీకు వృత్తిలో నెలకు ఎంత గిట్టుబాటు అవుతుంది?"

అనసూయ క్షణం తటపటాయించింది. ఇది నిజం చెప్పవలసిన సన్నివేశం కాదనుకుంది.

"నాకు నెలకు అయిదొందలు చిక్కుతుంది వృత్తిలో..."

అనసూయ మాటలను విని శ్రీపతి ఒక అర క్షణం ఆలోచనలో పడ్డాడు. చకచక మనస్సులోనే లెక్కలను గట్టాడు. ఆఖరుకు అన్నాడు:

"అనసూయా! అయితే ఒక పని చెయ్యి! నీకు నెలకు వెయ్యి రూపాయలు ఆదాయం వచ్చేట్టు చేస్తాను. నీ జీవితాంతం నెలకు వెయ్యి రూపాయలు వచ్చేట్టు చేస్తాను. మరి నా కోర్కె తీర్చవా!"

అనసూయకు వెయ్యి రూపాయలు అన్న మాటలు వినగానే ఒళ్ళు ఝుల్లుమన్నది. ఇంతలో అనుమాన మేఘం ఆవరించింది ఆమె ముఖంలో.


ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు
★ ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, బెడ్ షీట్లు
★ స్కూలు యూనిఫారంలు _ వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రములు షోరూమ్
ఓ.పి. హాస్పిటల్ రోడ్డు,
గవర్నరుపేట......విజయవాడ-2





శుభవార్త
నాడీప్రవీణ దీర రోగ నిపుణులు
డా॥ ఎస్. ఎస్. రావు, M.B.H., R.M.P.
గారిని సంప్రదించండి.
రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,
ప్లాట్ నెం. 471. జూబ్లిహిల్సు.
హైదరాబాద్ 500 034.

శరీర బలహీనత, పూబగా పెరుగుట గాని, చిన్నప్పటినుండి ఏ మందు వలనను లావు కాకపోవుట, అంగములు ఉండవలసిన సైజులో ఉండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండె దడ, రక్త ప్రసరణ ఎక్కువ గావడం, లేక తక్కువ గావడం, సర్వ విధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తికడుపు ఎత్తుగ పెరగడం, జలోదరం, కడుపునొప్పి, గ్యాస్టిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలిచేరుట, స్త్రీల ముట్టుకట్టునొప్పి కుసుమ వ్యాధి (ఏ రంగైనా సరే), మూత్ర వ్యాధులు, మూలశంక, సుఖవ్యాధులు, స్త్రీలకు గాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపునొప్పి నడుంనొప్పి, కీళ్లవ్యాధులు, వాపు, నీరు చేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరము, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘ వ్యాధులుగా పరిణమించినప్పుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలము : ఉ. 7 గంటల నుండి సా. 5 గంటల వరకు
పరీక్ష ఫీజు : రూ. 15/—. చికిత్సకు అదనం.

ఆగస్టు నెల క్యాంపులు: 3 వ తేదీ : కడప — ద్వారకా లాడ్జి, 4 వ తేదీ : గుంటకల్ — శ్రీ లాడ్జి, 5 వ తేదీ : కర్నూలు — న్యూ ఉడిపి హోటల్, పెద్దమార్కెట్ వద్ద, 6, 7 తేదీలు : బెంగుళూరు — న్యూ మైసూర్ కేఫ్, కెంపగౌడా రోడ్. 8 వ తేదీ : తిరుపతి — భీమాస్ అనెక్స్ లాడ్జి, 9 వ తేదీ : నెల్లూరు—రాఘవ విహార్, 10, 11 తేదీలు : మద్రాసు — కోమల విలాస్, నెం. 12, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్ (జి.టి.), హైకోర్టు ఎదురుగా, 13, 14 తేదీలు : వైజాగ్— బృందావన్ లాడ్జి, డాబా గార్డెన్సు, 15, 16 తేదీలు : రాజమండ్రి—శాంతినివాస్, మెయిన్‌రోడ్, 17వ తేదీ: విజయవాడ—మోడరన్ కేఫ్ లాడ్జి, (గాంధినగర్), 18 వ తేదీ ఖమ్మం—మయూర్ కేఫ్, (శేషమహల్ లాడ్జి),

N.B. పోస్టు ద్వారా సలహా కోరువారు ఫీజు రూ. 15. జవాబుకు పోస్టు బిళ్లలు పంపవలెను.

SWASTIK

"నిజంగానా?!... సగంలో మోసం చేస్తే?"

"వూహూఁ! నీ కటువంటి అనుమానాలు వద్దు! నీ పేరన లక్ష రూపాయలు బ్యాంకులో వేస్తాను. దాని మీద నీకు వచ్చే వడ్డీతో నీ జీవితాంతం బ్రతకవచ్చు!"

"సరే—కానివ్వండి!"

"చాలా సంతోషం, అనసూయా!...కానీ...మనకు పుట్టబోయే బిడ్డ శాశ్వతంగా నా బిడ్డే అవుతుంది! ఆ బిడ్డ జీవితంలో నీ చాయ ఏనాటికీ పడదు! ఏమంటావ్?"

అనసూయ మనస్సులో లక్ష రూపాయలు, నెలకు వచ్చే వడ్డీ కనిపిస్తున్నాయి.

"ఆ బిడ్డ మీదే అవుతుంది! నాకేం సంబంధం లేదు!"

"మరొక్క మారు జాగ్రత్తగా ఆలోచించుకుని చెప్పు!"

"ఇన్నిసార్లు ఆలోచించే దేముందండీ?!"

"కేవలం నీ మాట మీద నమ్మకం పెట్టుకుంటానని అనుకోకు. అనేక అగ్రిమెంటు కాగితాం మీద సంతకం పెట్టించుకుంటాను. ఇక నీవు మనస్సు మార్చుకున్నా, మనకు పుట్టబోయే బిడ్డ మీద నీకు ఎక్కడా, ఎప్పుడూ ఎలాంటి హక్కు లేకుండా పోతుంది!"

"మీ ఇష్టం!"

• • •

వూరికి దూరంగా ఉన్న ఒక అందమైన కాలనీలో ఒక చక్కని డాబాలో ముందు గదిలో అనసూయ ఒక సోఫాలో కూర్చుని మామిడి ముక్కలను తింటూ ఉన్నది. సోఫాకు ఎదురుగా ఒక పళ్ళెంలో మామిడిముక్కలు, ఉప్పు ఉన్నాయి. అనసూయ ఆలోచనల్లో పడ్డది.

ఆ రోజే తను గర్భవతి అని డాక్టర్ నిర్ణయించి, కొన్ని రోజులుగా తన కున్న అనుమానాన్ని రూఢి పరిచింది. డాక్టర్ అలా చెప్పడంతో ఉబ్బి తబ్బిబ్బైపోయాడు శ్రీపతి. తనకు ఏమీ అనిపించలేదు వెంట వెంట వచ్చే వైత్యపు కెర్లింపులు తప్ప.

అనసూయ మనస్సంతా ఆనందంతో నిండిపోయింది. తను వచ్చిన పని ఇంత త్వరగా తెమిలిపోతుం దనుకోలేదు. డాక్టర్ చెప్పిన మాటల ప్రకారం తను మూడో నెల గర్భిణి—ఇంక ఆరు నెలలు! ఆ తరవాత తను స్వేచ్ఛా జీవి! శ్రీపతి అప్పటికే లక్ష రూపాయలు బ్యాంకులో తన పేరన డిపాజిట్ చేశాడు. మొట్టమొదటిసారిగా మూడు నెలల వడ్డీ దాదాపు మూడు వేల రూపాయలూ వచ్చేశాయి. ఇక తన జీవితాంతం ఇలాగే వడ్డీలు వస్తూ ఉంటాయి. ఇక వ్యభిచారవాడలో దినం ఒక గండంగా గడప పనిలేదు. అనసూయకు చాలా ఆనందం కలిగింది. దుఃఖపు చాయలుగాని, కనీసం భవిష్యత్తులో రాబోయే ఎలాటి కష్టమూ ఆమె మనసుకు స్ఫురించ లేదు. ఇంత ఆనందంగా తన జీవితంలో ఎప్పుడూ లేదు అని అనుకుంది అనసూయ.

వాకిట్లో కారు ఆగిన చప్పుడు అయింది. అనసూయ ఆలోచనలు చెదిరిపోయాయి. వంటింట్లో వంట పనిలో నిమగ్నురాలైన పనిపిల్ల సుబ్బులు సంభ్రమంగా వాకిట్లోకి వెళ్ళింది, కారులో రాబోయే శ్రీపతిని ఆహ్వానించడానికి.

కారులో నుండి శ్రీపతి, మొట్టమొదటి సారిగా సుమిత్ర దిగారు.

"సుబ్బులూ! లోపల పండ్ల బుట్ట లున్నాయి! తీసుకుని రా!" అని శ్రీపతి ఆజ్ఞాపిస్తూ ఇంట్లోకి నడిచాడు. శ్రీపతి వెనుక సుమిత్ర, ఆమె వెనుక రెండు చేతులలో రెండు పండ్ల బుట్టలతో సుబ్బులు నడిచారు.

"అహహా! లేవకు!... కూర్చో!... డాక్టర్ ఫోన్ చేసి చెప్పింది!..." అంటూ ఆత్రతగా నడిచి వచ్చి శ్రీపతి అనసూయను పట్టుకొని కూర్చోబెట్టబోయి, మళ్ళీ వెనుక వస్తూ ఉన్న సుమిత్రను గమనించినట్లుగా ఠక్కున ఆగిపోయాడు, అనసూయను తాకకుండానే.

అనసూయ చూపులు సుమిత్ర మీదనే ఆగిపోయాయి.

అనసూయ సోఫాలో నుండి లేవబోయిందల్లా మెల్లగా కూర్చుని సుమిత్ర అందానికి ముగ్ధురాలై చూస్తూ ఉండిపోయింది.

సుమిత్ర పనిపిల్ల చేతుల్లో నుండి పండ్ల బుట్టలు అందుకొని, వాటిని తెచ్చి అనసూయ ఎదురుగా పెట్టి, ఒక బుట్టలోని ఆపిల్, బత్తాయి లను రెండు రెండు తీసి అనసూయ ఒడిలో పెట్టింది. మెల్లగా అనసూయ ప్రక్కన కూర్చుని అనసూయ జడను, ముఖాన్ని, చేతులను ఆప్యాయంగా నిమురుతూ ఉన్నది.

"ఎలా ఉంది, అనసూయా, ఒంట్లో?" అడిగాడు శ్రీపతి, అనసూయకు ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుని.

"బాగానే ఉందండీ!"

"సంతోషం! మందులూ, టానిక్‌లూ కొని సాయంకాలం పంపుతాను! నీకు ఏం కావాలన్నా వెంటనే నాకు ఫోన్ చెయ్యి! పంపుతాను!"

"అలాగేనండీ!"

కొద్ది క్షణాలు మౌనంగా దొర్లిపోయాయి. ఆ కొద్ది క్షణాలలో శ్రీపతి, సుమిత్ర ఒకర్నొకరు చూసుకుంటూ, మౌనంగా సంభాషించుకొంటూ ఆనంద కోరికల్లో మునిగిపోవడాన్ని అనసూయ క్రీగంట గమనిస్తూ ఉన్నది. ఆ కొద్ది క్షణాలలో సుమిత్ర కంటే తనే గొప్పది అన్న భావం

దేశాలలో 50 రోజులు!
డాక్టర్
సి. నారాయణరెడ్డి
గారు యూరోపై రాజులు
పాటు అమెరికా, బ్రిటన్
దేశాలలో పర్యటించి నప్పటి
అనుభవాలు
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
19-8-1981 జన్మదిన
ప్రత్యేక సంచిక
నుండి ధారా వాహికంగా ప్రచురిస్తున్నా
మని తెలియజేయడానికి సంతసిస్తు
న్నాం! 120 పేజీలు * రు.1.60

కలిగి అనసూయ సంతోషపడింది.

మరికొన్నిసార్లు జాగ్రత్తలు చెప్పి శ్రీపతి లేచాడు. వెంటనే సుమిత్ర గూడా లేచింది. ఇద్దరూ కలిసి వాకిట్లోకి వెళ్ళారు. కారు వెళ్ళిపోయినట్లుగా చప్పుడు అయింది.

అనసూయ ఆత్రంగా ఏపిల్సును తినడం మొదలు పెట్టింది.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు అనసూయ భోజనం చేసి బెడ్‌రూంలోకి చేరుకుంది. బెడ్‌రూంలో ఉన్న శ్రీపతి ఫోటోను ఒకటికి పది మార్లు తన పమిటె కొంగుతో తుడిచింది. ఆ ఫోటోను అనేక కోణాల్లో పరిశీలించింది. ఆఖరుకు ఫోటోను గోడకు తగిలించి విశాలమైన డబుల్ బెడ్ మీద పడుకుంది.

అనసూయ ఆలోచనలు శ్రీపతి రూపం చుట్టూ తేనెటీగలలాగా ముసురుకున్నాయి. ఇంతవరకూ ఒక పురుషుని రూపం గానీ, అంద చందాలు గానీ అనసూయ ఆలోచనలలో ఏ నాడూ నిలబడలేదు. అనసూయకు వూహ తెలిసినప్పటి నుండీ భవిష్యత్తును గురించిన భయంకరమైన ఆలోచనలే వచ్చేవి.

ఆ రోజు అనసూయ మస్తిష్కంలో శ్రీపతి బలంగా చోటు చేసుకున్నాడు. శ్రీపతిని ఒక కుర్చీలో కూర్చోపెట్టి, తను ఎదురుగా నిలుచుని శ్రీపతి అందమైన వంకుల జుట్టునూ, అతడి నల్లని కనుబొమ్మలనూ, మీసాలనూ, పచ్చని బుగ్గలనూ, విశాలమైన అతడి వక్షఃస్థలాన్నీ తడుముతూ అలాగే శాశ్వతంగా ఉండిపోవాలన్న కోరిక విపరీతంగా కలగడం మొదలుపెట్టింది.

జీవితంలో మొట్ట మొదటిసారిగా ఒక పురుషుడితో స్నేహంగా గడపాలని అనసూయకు అనిపించింది. ఆ భావం ముందు లక్ష రూపాయలూ, అది సంవత్సరానికి ఇచ్చే వడ్డీ పది వేల రూపాయలూ పెనుగాలిలో దూదిపింజల వలె ఎగిరిపోయాయి!

దాదాపు ప్రతి రోజు శ్రీపతి రాత్రి తొమ్మిది, తొమ్మిదిన్నర గంటల కల్లా అనసూయ ఇంటికి వచ్చేవాడు. కానీ ఆ నాడు రాత్రి పదిన్నర గంటలైనా శ్రీపతి రాలేదు. అనసూయకు అసహనం జాస్తి అయింది. అనసూయకు ఆ రోజు ఒక వెర్రి కోర్కె కలిగింది. విశాలమైన బెడ్ మీద శ్రీపతి పడుకుని నిద్ర పోతుంటే, తను పక్కగా కూర్చుని తెల్లవార్లూ శ్రీపతిని చూడాలని మనస్సు ఉరకలు వేస్తున్నది. శ్రీపతి నిద్ర పోతుంటే శ్రీపతి పాదాలను ఒత్తాలనీ, శ్రీపతి ముంగురులు తడవాలనీ, అతని బలమైన చేతులను నిమరాలనీ మనస్సు ఉరకలు వేస్తున్నది.

గడియారం పదకొండు గంటలు కొట్టడంతో అనసూయ ఉలిక్కి పడింది. ఇక శ్రీపతి రాడు అని అనుకుంది. అయినా ఆ నాడు కలిగిన వెర్రి కోర్కెను ఎలాగైనా తీర్చుకోవాలనుకుంది. వెంటనే లేచి, ఫోన్ దగ్గరకు వెళ్ళి శ్రీపతి ఇంటికి ఫోన్ చేసింది.

సుమిత్ర ఫోన్ ఎత్తింది.

"శ్రీపతిగారున్నారా?"

"ఉన్నారు."

"ఏం చేస్తున్నారు?"



చిత్రం: రాగతి పండరి

సుమిత్ర క్షణం ఆగి "నిద్ర పోతున్నారు!" అని అన్నది.

"వారితో మాట్లాడాలి!"

"ఎందుకు?"

"శ్రీపతిగారితో మాట్లాడాలి!"

"ఇప్పుడా?"

"అవును!"

"రేపు ఉదయం వస్తారు."

"వూహుఁ! ఇప్పుడే మాట్లాడాలి!"

"సరే! ఉండు!"

రెండు నిమిషాలయ్యాక శ్రీపతి ఫోన్ అందుకున్నాడు.

"అనసూయా!"

"నేనేనండీ! ఏమిటి? ఈ రోజు ఇంత ఆలస్యం చేశారు?"

శ్రీపతి మవునం వహించాడు.

"త్వరగా వచ్చేయండి!"

"అనసూయా!"

"చెప్పండి!"

"అనసూయా! మరీ అమాయకంగా మాట్లాడకు. మన అగ్రిమెంట్లూ వగైరా జ్ఞాపకం చేసుకో! అయినా ఇంకోమారు జ్ఞాపకం చేస్తున్నాను. బిడ్డ కలిగేంత వరకే మన అనుబంధం. ఆ తరవాత నీవు బిడ్డను మాకు ఇచ్చి వెళ్ళిపోవాలి!"

"ఆ విషయాలన్నీ. తెలుసండీ! కానీ ఈ రోజు మిమ్మల్ని కండ్లారా చూడాలనీ, మీ రూపంలోని ప్రతి అణువు నా మనస్సులో ముద్రించుకోవాలనీ ఆరాటంగా ఉంది. మీకు శ్రమ కలిగించను. ప్లీజ్, రండి! వచ్చి నా పక్కన నిద్రపోండి. తెల్లవార్లూ మిమ్మల్ని చూస్తూ కూర్చోవాలని ఉంది."

"అనసూయా? ఏమిటీ పిచ్చి కోరిక?"

"పిచ్చి కోరికేనండీ! ఏ నాడూ ఏ మగవాణ్ణీ ఇంతలా చూడాలని నాకు అనిపించ లేదు. బహుశః నాలో పెరుగుతున్న మీ బిడ్డ నా ద్వారా తన తండ్రి రూపాన్ని చూసుకుని అలాగా రూపురేఖలు దిద్దుకోవాలని ఆరాట పడుతున్నదని నా అనుమానం!"

"నాన్సెన్స్! మన సంబంధంలో ఇలాంటి సెంటిమెంట్సు ఉండకూడదని మన అగ్రిమెంటు. అనవసరపు కోరికలు పెంచుకోక విశ్రాంతి తీసుకో!" అంటూ శ్రీపతి ఫోన్ పెట్టేశాడు.

అనసూయ ఆత్రతగా, జాలిగా మవునం వహించిన ఫోన్‌లోకి నాలుగైదుసార్లు హలో! హలో! అని అన్నది. శ్రీపతి మొరటుతనానికి అనసూయకు ఏమాత్రం కోపం రాలేదు. ఫోన్ పెట్టేసి గోడమీది శ్రీపతి ఫోటోను తీసుకుని బెడ్ మీదకు చేరింది అనసూయ. తెల్లవార్లూ శ్రీపతి ఫోటోను చూస్తూనే ఉంది. ఆ తరవాత మరి నాలుగు నెలలదాకా అనసూయ తీరిక సమయాల్లో శ్రీపతి ఫోటోను చూస్తూనే ఉంది.

అనసూయ గర్భంలో పెరుగుతున్న బిడ్డ తన్నిన మొదటి తాపుకు అనసూయ దేహం ఝల్లు మనడం, అనసూయ చేతిలోని శ్రీపతి ఫోటో శాశ్వతంగా జారిపోవడం ఒకేమారు జరిగాయి.

ఆ నాటి నుండి అనసూయ శ్రీపతి ఫోటో వంక కన్నెత్తి చూడలేదు. తన కడుపులో కదులుతున్న బిడ్డ ప్రతి కదలికనూ, ఆ బిడ్డడు తన్నే చిన్న చిన్న తాపులకు సన్నని, తీయని బాధతో మధురంగా మూలుగుతూ, మనోనేత్రంలో ఆ బిడ్డడినిచూస్తూ, బాహ్య నేత్రాలతో ఆ బిడ్డడిని చూడాలని తహతహలాడేది.

కొన్ని రోజులు దగ్గరయ్యే కొద్దీ అనసూయకు బిడ్డడి మీద అనురాగం పెరగసాగింది. ఆ బిడ్డడిని పుట్టగానే శ్రీపతికి ఇచ్చి తను వెళ్ళిపోవాలని జ్ఞాపకం వచ్చి విలవిలలాడి పోయేది. శ్రీపతిని బ్రతిమాలి, బామాలి తన బిడ్డను దక్కించుకోవాలని ఆరాట పడింది. సుమిత్ర లాంటి కోటీశ్వరురాలికి దక్కని సౌభాగ్యం తనకు ప్రసాదించిన భగవంతునికి కృతజ్ఞతలను అర్పించింది. లక్ష రూపాయలూ, దానిమీద వచ్చే వడ్డీ తిరిగి శ్రీపతికి ఇచ్చి అయినా తను బిడ్డను దక్కించుకోవాలన్న ఆరాటం ప్రారంభం అయింది. ప్రేమానురాగాలు శూన్యమైన శ్రీపతి, అతని భార్య చేతులలో తన బిడ్డకు ఎన్నో కష్టాలు కలుగుతున్నట్లు, వాటిని గురించి తను అహరహం వేదనతో క్రుంగి పోయినట్లుగా తలచుకొని దుఃఖించేది.

నెలలు నిండగానే అనసూయను ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో చేర్చారు.

మూడు రోజులు యమయాతన పడి అనసూయ ఆడపిల్లను ప్రసవించి, బెడ్ మీద మగతగా పడి ఉన్నది కొన్ని గంటలపాటు. అనంతరం తెలివి రాగా అనసూయ కళ్ళు మూసుకొనే తన పొట్టను తడుముకున్నది. వెంటనే బెడ్ పైన తడుముకున్నది. అనసూయ చేతికి బిడ్డ తగలక పోవడంతో చివాలున బెడ్ మీద నుండి లేచి బిడ్డకోసం బెడ్ అంతా చూసుకున్నది.

"బిడ్డ జాగ్రత్తగా శ్రీపతిగారి దగ్గర ఉంది! మీరు విశ్రాంతి తీసుకోండి!" అన్నది నర్స్.

"నేను బిడ్డను చూడాలి!" అంటూ బెడ్ మీద నుండి లేవబోయి, నీరసంగా క్రింద పడిపోయింది అనసూయ.

నర్స్ చివాలున అనసూయను సమీపించి "మీరు రెస్ట్ తీసుకోవాలి" అని కఠినంగా ఆజ్ఞాపిస్తూ, అనసూయను లేవనెత్తి బెడ్‌మీద కూర్చోబెట్ట బోయింది. అనసూయ "నా బిడ్డ—నా బిడ్డ—నేను చూడాలి!" అనుకుంటూ గది వెలుపలికి పోబోయింది.

"మీరు కదలకూడదు! పడుకోండి!" అని కఠినంగా మందలిస్తూ నర్స్ అనసూయను మరో మారు బెడ్‌మీద పడుకోబెట్ట బోయింది.

"నా బిడ్డ!" అని మరో మారు ఆక్రోశించి అనసూయ నర్స్‌ను విదిలించి పారేసింది. నర్స్ సోలుతూ, సొలుగుతూ పోయి ఒక మూల పడింది.

అనసూయ పడుతూ, లేస్తూ గది వెలుపలకు వచ్చింది. మరో ఇద్దరు నర్సులు అనసూయను పట్టుకొని గదిలోకి నెట్టారు. అంత నీరసంలోనూ నిలద్రొక్కుకొని అనసూయ వెర్రికేకలు పెడుతూ నర్సులిద్దరినీ విదిలించి కొట్టి, "బిడ్డ! నా బిడ్డ!" అంటూ వెర్రిగా తిరుగుతున్నది. డాక్టర్లు, కాంపౌండర్లు, నర్సులు, అనసూయను శాంతపరిచి ఆమె బెడ్ వద్దకు తీసుకుని వెళ్ళలేక ఆఖరుకు ఒక గదిలోకి తీసుకుని వెళ్ళారు.

ఆ గదిలో సుమిత్ర ఒడిలో అనసూయ బిడ్డ ఉంది. శ్రీపతి వంగి ఆ బిడ్డతో ఏంటో మాట్లాడుతున్నాడు. అనసూయను, ఆమె వెంట ఉన్న డాక్టర్‌ను, నర్సులనూ క్రోధంగా చూస్తూ "ఏంటి డాక్టర్ ఇది" అని ప్రశ్నించాడు శ్రీపతి.

"సారీ! ఈవిడను కంట్రోల్ చేయడం అసాధ్యం అనిపించింది" అని నసిగాడు డాక్టర్.

గదిలో తన బిడ్డను చూసిన వెంటనే పరుగు పరుగున అనసూయ వెళ్ళి సుమిత్ర ఒడిలోని బిడ్డను లాక్కుని రొమ్ములకు హత్తుకొని, యోగ సమాధిలోని ఋషీశ్వరుడి వలె నిశ్చలంగా ఉండిపోయింది.

"అనసూయా! అనసూయా ... ఏం టిది? మన అగ్రిమెంట్లూ, మనం అనుకున్న మాటలూ, చేసుకున్న నిర్ణయాలూ ఏమయ్యాయి?!"

"నాకేం తెలీదు! నాకేం తెలీదు! నా బిడ్డ! నా బిడ్డను ఎవ్వరికీ ఇవ్వను. మీ లక్ష రూపాయలూ, వద్దు ... ఇల్లూ మీరే తీసుకోండి. నా బిడ్డకు నన్ను దూరం చేయకండి" అన్నది అనసూయ బిడ్డను ఇంకా హృదయానికి గట్టిగా హత్తుకుంటూ.

శ్రీపతి క్రోధంగా అనసూయతో తగాలాడుతుంటే, డాక్టర్ వారించి "శ్రీపతిగారూ! శాంతించండి. మీ బిడ్డ ఎక్కడికీ పోదు! కొద్ది క్షణాలు తల్లినీ బిడ్డనూ విశ్రాంతి తీసుకోనివ్వండి" అంటూ అనసూయను మెల్లగా నడిపించుకుని వెళ్ళాడు డాక్టర్.

"డాక్టర్! మీకు అన్నీ చెప్పాను. ఆ బిడ్డ నాది! బిడ్డ పుట్టగానే ఒక్కమారైనా తల్లిపాలు తాగకూడదని అగ్రిమెంటు" అంటూ శ్రీపతి వాదిస్తున్నాడు.

"నిజమే! కానీ తన బిడ్డకు దూరం అయి... ఈ తల్లి శాంతించలేదు. శాంతించకుంటే ఆమె పరిస్థితి దృష్ట్యా ఆమె ప్రాణానికి హాని కలగవచ్చు.

## పరిశీలన

**మన చుట్టుపక్కల ఉన్న వారిలో కనిపించే వేయి తప్పులకన్నా, మనలోని ఒక్క తప్పు అతిప్రమాదకరమైంది.**

ఆమె ప్రాణానికి హాని కలిగితే అది హత్య అవుతుంది. మరి ఆ విషయం అగ్రిమెంటులో ఉందా?" అని అన్నాడు డాక్టర్.

ఇంకా ఏదో వాదించబోయే శ్రీపతిని పట్టుకుని ఆపింది సుమిత్ర.

ఆ రోజు రాత్రి రెండు గంటలకు అందరూ తూగుతూ ఉండే సమయంలో అనసూయ బిడ్డతో సహా డిస్పెన్సరీ నుండి పరారీ అయింది.

శ్రీపతి ఇచ్చిన పోలీస్ కంప్లెయింట్ వల్ల ఇరువది నాలుగు గంటలలో అనసూయనూ, బిడ్డనూ అరెస్టు చేసి జైలులో పెట్టారు పోలీసులు.

వారం రోజులలో కేసు హియరింగ్‌కు వచ్చింది కోర్టులో.

శ్రీపతి తరపు లాయర్ ఉక్కుచట్రం లాంటి వాదనలతో అనసూయకు పాయింట్ లేకుండా కోర్టులో వాదించాడు. అనసూయ లాంటి పచ్చి వ్యభిచారిణి శ్రీపతి లాంటి మర్యాదస్థుణ్ణి ఎంత నమ్మక ద్రోహం చేసిందో, ఎంత ధన నష్టానికి పాలు చేసిందో సవివరంగా కోర్టు వారికి తెలియజేశాడు,

కోర్టు వారు దయా ధర్మంగా నియమించిన అనసూయ తరపు న్యాయవాది పేలవంగా వాదించాడు.

కేసు శ్రీపతి గెలుస్తాడు అని అందరూ అనుకున్నారు.

"అమ్మా! చివరగా నీవు చెప్పుకోవలసింది ఏమైనా ఉందా?" అని జడ్జి అడిగాడు అనసూయను. ధారాపాతంగా కారుతున్న కన్నీటితో అనసూయ ఇలా అంది:

"అయ్యా! శ్రీపతిగారు నా మీద మోపిన నేరాల నన్నింటిని ఆమోదిస్తున్నాను. అగ్రిమెంటుల మీద సంతకం పెట్టింది నిజమే! డిస్పెన్సరీ నుండి పారిపోయింది నిజమే! కానీ, నా బిడ్డను వదిలి క్షణం బతకలేను. నాకు ఏమీ వద్దు. డబ్బు వద్దు. గౌరవం వద్దు. నా బిడ్డ నాకు కావాలి! నా బిడ్డను నాకు ఇవ్వలేకుంటే ముందు నాకు మరణశిక్ష విధించండి! కానీ, నా బిడ్డకు నన్ను దూరం చెయ్యకండి."

అనసూయ ఆఖరి మాటలను విని జడ్జి కొంతసేపు తల వంచుకుని, ఏదో వ్రాసుకుంటున్నాడు. కోర్టు అంతా నిశ్శబ్దంగా ఉంది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ కోర్టువారు ఇలా జడ్జిమెంటును చదివారు. జడ్జిమెంటు సారాంశం ఇలా ఉంది:

"శ్రీపతి, అనసూయల నడుమ తగాదాను కోర్టు వారు క్షుణ్ణంగా పరిశీలించారు. అనసూయ స్వహస్తాలతో సంతకం చేసిన అగ్రిమెంటుల వలన అనసూయకు బిడ్డ పైన ఎలాంటి చట్టపరమైన హక్కు లేదు.

కానీ ఇందులో చట్టం కంటే బలవత్తరమైన సహజ న్యాయం ఇమిడి ఉంది. ప్రాసిక్యూషన్ వారు అనసూయ ఎలాంటి నీచమైన స్త్రీయో నిర్ద్వంద్వంగా నిరూపించారు. కానీ అనసూయ అగ్రిమెంటును సంతకం పెట్టిన నాటికి పరమ నీచమైన వ్యభిచారిణి అయినప్పటికీ, మాతృమూర్తి కాదు! మాతృత్వంలోని ఒత్తిడులు, మానసిక సంక్షోభాలు, ప్రకృతి వేసే బంధాల గురించి ఏమీ తెలియని స్త్రీ! అందువల్ల ఆమె అజ్ఞానంగా అన్నిటికీ ఒప్పుకుంది.

కానీ శ్రీపతి! అతడికి అన్నీ తెలుసు. అందువల్లనే అంత చట్టబద్ధంగా, క్రమబద్ధంగా అగ్రిమెంటును బిగించాడు.

అనసూయ ప్రాసిక్యూషన్ వారు నిరూపించినట్లుగా ఐదు రూపాయలకు శీలం అమ్ముకునే పచ్చి వ్యభిచారిణి అయినా, తన బిడ్డ కోసం లక్ష రూపాయల రొక్కాన్నీ, మరో లక్ష రూపాయల ఇంటినీ తృణప్రాయంగాభావించి,ప్రకృతిఎడలవినయవిధేయత, భగవంతుని యందు బాధ్యత, తన కన్న బిడ్డ యందు అపారమైన అనురాగం చూపిన ఉత్తమ స్త్రీ అని కోర్టువారు గుర్తించక తప్పడం లేదు.

మానవ జీవితాన్ని శాసించేవి చట్టాలూ, కోర్టులే కాదు! మానవ సహజ న్యాయం! మానవ హక్కులు! మానవుని ప్రతి కదలికనూ చట్టబద్ధంగా నడిపించ బూనుకునే నియంతృత్వాలుకూడా ఆమోదించిన మానవ హక్కుల దృష్ట్యా అనసూయను, ఆమె బిడ్డను విడుదల చేస్తున్నాను.

ఈ కోర్టు తీర్పు పైన అప్పీలు చేసుకోవడానికి ఈ కోర్టు శ్రీపతికి హక్కులను ఇస్తున్నది."

జడ్జిమెంటు అయిపోగానే అనసూయ బోనులో నుండి దూకి, ఎదురుగా బల్లమీద పొత్తిళ్ళలో ఉన్న బిడ్డను ఎత్తుకుని హృదయానికి హత్తుకున్నది. తన్ను ఆపేవారు ఎవరూ లేకపోవడంతో అనసూయ కోర్టు వెలుపలికి నడిచి రోడ్డు పట్టుకుని వెళ్ళిపోతున్నది.

దూరంగా రోడ్డు మీద వెళ్ళే అనసూయను కోర్టు ముందు ఉన్న తమ కారులో నుండి విషాదంగా చూస్తూ ఉన్నారు శ్రీపతి, సుమిత్రలు.

"సుమిత్రా! ఇంతటితో వదులుతానని అనుకోకు! అప్పీలు పెట్టి, బిడ్డను సొంతం చేసుకుంటాను!" అన్నాడు శ్రీపతి పిడికిళ్ళు బిగిస్తూ.

"పోనీండి! ఇంతకూ ఆడపిల్లే గదా! మన వంశం ఆ పిల్లతో నిలిచేనా పెట్టేనా?"

"హూహూ! మగ పిల్లాడైతే అంత బాధ పడక పోదును! ఆడపిల్ల! కోటీశ్వరుడైన శ్రీపతికి పుట్టిన ఆడపిల్ల! ఆ వ్యభిచారిణి దగ్గర పెరిగితే..."

"ఏం పర్లేదండి! కోర్టువారన్నట్టు అనసూయ వ్యభిచారిణి అయినప్పటికీ, బిడ్డ కోసం లక్షలను కాలదన్నిన స్త్రీ. మనం లక్షలను వెదజల్లి తల్లీ బిడ్డలను వేరుచేద్దాం అనుకున్నాం! ఏమండీ! చట్టం మనల్ని సమర్థించలేదు! భగవంతుడూ మనల్ని కరుణించలేదు! ఇంకా పాపం మూట కట్టుకుందాం అంటారా?"

శ్రీపతి విభ్రాంతంగా సుమిత్రను చూస్తుంటే, అనసూయ సుమిత్రకు కనుమరుగై పోయింది.

★